## క్లుప్తంగా

### వాహనాల వేలం రేపు

పార్వతీపురంటౌన్: ప్రొహిబిషన్, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన త్రి చక్ర, ద్విచక్ర వాహనాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ పార్వతీపురం ఎస్‌హెచ్‌ఓ డి. పద్మావతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిపార్ట్‌మెంట్ వారు నిర్ణయించిన ధరావత్తు రూ. 2వేలు ముందుగా చెల్లించి టోకెన్ తీసుకొని ఈనెల 4న ఉదయం 10 గంటలకు పార్వతీపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో జరిగే వేలంపాటకు హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని వేలం పాటదారులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

### ఓటు హక్కుపై అవగాహన తప్పనిసరి



స్వీప్ యాక్టివిటీ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ కె.ఆనందరావు

పార్వతీపురం టౌన్: ఓటుహక్కుపై అవగాహన తప్పనిసరని తహసీల్దార్ కె. ఆనందరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన కొత్తవలస గ్రామంలో గల కొత్త పోలమ్మ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వీప్ యాక్టివిటీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బందికి ఓటు మీద అవగాహన నిర్వహించామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్యామ్, ఐసీడీఎస్ పీఓ తదితరులు పాల్గొన్నారు.

### ఏజెన్సీలో క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దండి శ్రీనివాస రావు, సర్పంచ్ బీసు

సాలూరురూరల్: మండలంలోని కొదమ పంచాయతీ చిన్న చోర గ్రామంలో జరగనున్న క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 16టీమ్‌లు పాల్గొన్నాయి. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు దండి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కొదమ సర్పంచ్ బోడి, ఎంపీటీసీ బీసు కార్యక్రమంలో పాల్గొన్నారు. గిరిజనులు ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంటులో గెలిచిన వారికి గిరిజన నాయకుల చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేయనున్నామని సర్పంచ్ బీసు తెలిపారు.

### గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు




నిడగల్లులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయని ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ అన్నారు. ఈ మేరకు నిడగల్లు, బుడ్డిపేట,సీతానగరం గ్రామాల్లో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు.

### గ్రామస్థాయిలో ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

పార్వతీపురం: గ్రామస్థాయిలో రాజకీయపార్టీలు ప్రచారానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ (ఎంసీసీ) కన్వీనర్, ఎంపీడీఓ జావేద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం నిమిత్తం రాజకీయ నాయకులు, వ్యక్తులు వచ్చి వ్యక్తిగత సమాచారం అడిగితే ఓటర్లు చెప్పరాదని సూచించారు. ఎలాంటి అనుమానాలున్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గ్రామాల్లో కోడ్ అమలుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### సారా పట్టివేత



సారాతో పట్టుబడిన వ్యక్తులు

సీతంపేట: మండలంలోని మండ గ్రామ సమీపంలో మంగళవారం 200 లీటర్ల సారా పట్టుకున్నట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. సారా బట్టీలపై దాడులు చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు సారా అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. వీరిలో నలుగురు పట్టుబడ్డారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి, మరోవ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

# సంక్షేమ సర్కారును మళ్లీ గెలిపించాలి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు, జమ్మాన ప్రసన్నకుమార్ తదితరులు

పార్వతీపురం టౌన్: గడిచిన 58 నెలల్లో ప్రజలకు చేకూరిన సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మే 13వ తేదీన జరగనున్న ఎన్నిల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను గెలిపించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలోని 4వ వార్డులో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందించిన విషయాన్ని గమనించాలని కోరుతూ ఓట్లను అభ్యర్థించారు. ప్రచారంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటేనే సంక్షేమం పారదర్శకంగా అందుతుందనే విషయాన్ని ప్రజలే చెబుతున్నారన్నారు. అబద్ధపు హామీలతో చంద్రబాబు గతంలో గద్దెనెక్కి ప్రజలను మోసం చేశారని, సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని గుర్తు చేశారు.

**చంద్రబాబు విషపూరిత కుట్రలు**

ప్రచారం అనంతరం ఎమ్మెల్యే జోగారావు విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రవేశట్టిన సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అవ్వాతాతల పింఛన్ల విషయంలో చంద్రబాబు, నిమ్మగడ్డ రమేష్‌లు కోర్టుకు వెళ్లి విషపూరిత కుట్రకు దారి తీశారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో అవ్వాతాతల ఉసురు చంద్రబాబు కూటమికి తగులుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, స్థానిక కౌన్సిలర్‌లు సువ్వాడ లావణ్య, కోరాడ శ్రీనివాసరావు, యడ్ల త్రినాథ, మజ్జి నాగమణి, తాడ్డి శంకర్రావు, ఆకుల శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీను, మజ్జి శశికర్, పార్టీ నాయకులు, గృహసారథులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల్లో విస్తృతంగా వైఎస్సార్‌సీపీ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

సాలూరు: ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సంక్షేమ, అభివృద్ధి పాలనకు మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు.ఈ మేరకు మంగళవారం సాలూరు పట్టణంలోని 13,16 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ఈ ప్రచారంలో ప్రజలకు వివరించారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలకు చేసిన మేలును గుర్తుచేశారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాన్ని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గిరిరఘు, గొర్లె మాధవరావు, రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

## లచ్చయ్యపేటకు తీరిన మంచినీటి సమస్య



పూర్తి కావచ్చిన ఇంటింటి కుళాయి పనులు

- రూ.11.5 లక్షలతో ఇంటింటి కుళాయిల ఏర్పాటు



నిర్మించిన ఓవర్ హెడ్‌ట్యాంక్

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో- ప్రజలకు అవసరమైన సదుపాయాలు లేక అవస్థలు పడుతున్న సమయంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషి ఫలితంగా సామాజిక పరమైన సమస్యలు తీరాయని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు గ్రామంలో ఇంటింటి కుళాయిల ఏర్పాటు కోసం చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణం, పైపల్‌లైన్లు వేయడం వల్ల గ్రామంలో తాగునీటి సమస్య తీరిందని చెబుతున్నారు. అలాగే రూ.19 లక్షలతో గ్రామంలోని పాఠశాలకు అదనపు భవనాలు, మంచినీరు సౌకర్యం, ఆటస్థలం, వంటగదుల నిర్మాణం జరిగినట్లు చెప్పారు.

### కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటన

- పార్వతీపురానికి మోహన్ రావు, సాలూరుకు పుష్పారావు ఎంపిక

పార్వతీపురం టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను మంగళవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో పార్వతీపురం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పాలకొండ పట్టణానికి చెందిన, న్యాయవాద వృత్తిలో ఉన్న బత్తిన మోహన్‌రావును ఖరారు చేసింది. అలాగే సాలూరు నియోజకవర్గం అభ్యర్థిగా మువ్వల పుష్పారావును ప్రకటించింది. ఆయన సాలూరు మండలంలోని తుండ పంచాయతీ జగ్గందొరవలస గ్రామానికి చెందిన వారు.

### ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్స్ పరిశీలన



ఓటింగ్ మెషీన్లు భద్రపరిచే హాల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

సీతానగరం: మండలానికి సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు భవనాలను తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జూన్ 13న జరగనున్న సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని ఓటింగ్ వినియోగించు కోవడానికి ఉపయోగించే ఈవీఎంలను గరుగుబిల్లి మండలంలో ఉల్లిభద్ర వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ కళాశాలలో భవనాలను పరిశీలించినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లతోపాటు ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఇక్కడే జరగనున్నందున ముందు జాగ్రత్త చర్యగా ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్‌ను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.హేమలత ఆదేశాల మేరకు పరిశీలించామన్నారు. ఇప్పటికే కౌంటింగ్ హాల్ భద్రతపై సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి, వనరులను పరిశీలించామని తెలిపారు.

## సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు

సీతానగరం: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, అసంఘటిత కార్మికులకు ప్రతినెలా 1వ తేదీన ప్రభుత్వం ఇచ్చే పింఛన్లు బుధవారం ఉదయం నుంచి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం వెల్ఫేర్‌సహాయకులు పంపిణీ చేయాల్సి ఉందని, అందుకు వారు సమాయత్తం కావాలని ఎంపీడీఓ ఎం ఈశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమార వర్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతినెలా రూ.3 వేలు వంతున ఇస్తున్న పింఛన్ డబ్బు ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకుల ద్వారా పంపిణీ చేయాలని మార్గదర్శకాలు విడుదల చేసిందని, వారంతా పింఛన్ లబ్ధిదారు ఇంటికి వెళ్లి పంపిణీ చేయాలని సూచించారు. పింఛన్ పంపిణీ సక్రమంగా సకాలంలో నిర్వహించాలని కోరారు. గ్రామాల్లో పింఛన్ పంపిణీ సమయంలో పింఛన్ లబ్ధిదారులంతా సహకరించాలని కోరారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



మాట్లాడుతున్న రూరల్ సీఐ రవికుమార్

సీతానగరం: పార్వతీపురం నియోజకవర్గంలో శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీస్‌శాఖ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టిందని పార్వతీపురం రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీతానగరం మండలంలోని బక్కుపేట, ఆర్‌వెంకంపేట, రామవరం, అంటిపేట, కాశీపేట పోలింగ్ కేంద్రాలను ఎస్సై ఎం.రాజేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ కొమరాడ, పార్వతీపురం రూరల్, సీతానగరం, బలిజిపేట మండలాల్లో జూన్ 13న జరగనున్న సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ఉన్నతాధికారుల సూచనల మేరకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నాలుగు మండలాల్లో ఎన్నికల అధికారులు నిర్దేశించిన 167 పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్లు తమ ఓటు వినియోగించుకునే విధంగా అధికారులు నిర్వహించిన పనులను పరిశీలించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో నిషేధిత సరుకుల తరలింపు నివారణకు కూనేరు,ఆర్.కె బట్టివలస, అడారులలో 3 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే మండలానికి 3 ఎఫ్ఎస్‌టీల వంతున నాలుగు మండలాల్లో 12 ఫ్లెయింగ్ స్క్వాడ్ టీమ్స్ పని చేస్తున్నాయని వివరించారు.మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలుకు ఎస్సైలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించినట్లు చెప్పారు. సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని గ్రామాల్లో ఎటువంటి సంఘటనలు సంభవించినా, కొత్తవ్యక్తులు వచ్చి ప్రలోభాలకు పాల్పడినా ఆయా మండలాల ఎస్సైలకు తక్షణమే సమాచారం ఇవ్వాలని, ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి సమాయత్తం కావాలని మహిళా పోలీసులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు



వెంకంపేటలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురం టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసంఫ్యామిలీ ఫిజీషియన్ విధానం దోహదపడుతుందని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం మండలంలోని జమదాల గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు నియమితులయ్యారన్నారు. ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరొకరు ప్రజల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. దాదాపు 13 రకాల వైద్య సేవలు ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అందుతాయని, 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నొస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎనిమిది రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోందని సంతోషం వెలిబుచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మతల్లి గోవ పండుగ



గంగమ్మతల్లికి తప్పెట గుళ్లతో పాటలు ఆలపిస్తున్న కళాకారులు

సీతానగరం:

మండలంలోని యాదవ కులస్తులు కులదైవంగా ఆరాధించే గంగమ్మతల్లి గోవ పండగ మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా యాదవ కులస్తులు మాట్లాడుతూ నిరంతరం గంగమ్మతల్లిపై భారం పెట్టుకుని గొర్రెలు, మేకలతో పొలాల్లోనే నివాసాలు ఉంటున్నామన్నారు. తల్లి దీవెనల కోసం ఏటా యాదవ కులకమిటీ సూచనల మేరకు గంగమ్మతల్లి ఉత్సవాలు నిర్వహించడానికి ముందుగా పాలవెల్లి నిర్మించి అమ్మవారి ప్రతిను నెలకొల్పి అమ్మవారికి ఇష్టమైన వివిధ రకాల పండ్లు, చీరలు కట్టి మొక్కులు తీర్చుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బూరిల అప్పయ్య, సింహాచలం, సన్యాసిరావు, గంగయ్య, బూరిల చిన్నోడు, కులపెద్దలు పాల్గొన్నారు.

## 4వతేదీన పింఛన్ల పంపిణీ

మక్కువ: ఈనెల 4వతేదీన లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించనున్నట్లు ఎంపీడీవో పి.దేవకుమార్ విలేకరులకు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రతి గ్రామానికి వెళ్లి పింఛన్‌సొమ్ము పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. దివ్యాంగులు, నడవలేని వారు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందిస్తామన్నారు. ఆలయాల వద్ద, పాఠశాల, అంగన్వాడీకేంద్రాలు, రచ్చబండల వద్ద పింఛన్ అందిస్తామని తెలిపారు. రెండురోజుల పాటు పింఛన్ సొమ్ము పంపిణీ జరుగుతుందని, సచివాలయ ఉద్యోగులు గ్రామాలకు వచ్చిన సమయంలో, పింఛన్ దారులు అందుబాటులో లేని యెడల మరుసటి రోజు సచివాలయానికి వచ్చి పింఛన్ సొమ్ము తీసుకోవచ్చని స్పష్టం చేశారు.

# ఎస్.పెద్దవలసలో అభివృద్ధి జోరు

- పంచాయతీలో సచివాలయం, ఆర్‌బీకే నిర్మాణం
- శీబిల్లిలో కోటి రూపాయలతో బ్రిడ్జి పనులు
- రక్షితమంచినీటిపథకం, బోరుబావి ఏర్పాటు
- కొత్తకామునివలసలో గ్రావెల్ రోడ్డు నిర్మాణం



ఆర్‌బీకే భవనం



శీబిల్లిలో నిర్మించిన రక్షితమంచినీటిపథకం

మక్కువ: మండలంలోని ఎస్.పెద్దవలస పంచాయతీలో అభివృద్ధి జోరందుకుంది. పంచాయతీ పరిధిలో గల శీబిల్లి, కొత్తకామునివలస, ఎస్.పెద్దవలస గ్రామాల్లో పలు అభివృద్ధిపనులు పూర్తికాగా, మరికొన్ని పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని తాగునీరు, రహదారి, బ్రిడ్జి సమస్యలు ఈ ప్రభుత్వం హయాంలో పరిష్కారమయ్యాయని గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎస్.పెద్దవలస గ్రామంలో రూ.42లక్షలతో గ్రామ సచివాలయం నిర్మించారు. అలాగే రూ.21.80లక్షలతో రైతుభరోసా కేంద్రం భవనం నిర్మించి ప్రజలు, రైతులకు అధికారులు సేవలందిస్తున్నారు. శీబిల్లి గ్రామంలో కొండగెడ్డపై కోటి రూపాయలతో బ్రిడ్జి పనులు చురుగ్గా జరిపిస్తున్నారు. ఆదే గ్రామంలో సుమారు రూ.9లక్షలతో రక్షితమంచినీటిపథకం, రూ.50వేలతో బోరుబావి ఏర్పాటుచేసి, గ్రామస్తుల తాగునీటి సమస్యను పరిష్కరించారు. గ్రామంలో కుళాయిల ఏర్పాటు కోసం పనులు జరిపిస్తున్నారు. కొత్తకామునివలస నుంచి, కొత్తకామునివలస కొత్తకాలనీ వరకు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు తన సొంత నిధులతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటుకు ఎర్త్‌వర్క్ పనులు జరిపిస్తున్నారు.



బ్రిడ్జి పనులు చేస్తున్న దృశ్యం



కొత్తకామునివలసలో పూర్తయిన గ్రావెల్‌రోడ్డు



గ్రామ సచివాలయం

### బ్రిడ్జి సమస్య తీరనుంది



శీబిల్లి గ్రామం సమీపంలోని కొండగెడ్డపై నుంచి నిత్యం నీరు ప్రవహిస్తుంటుంది. గతంలో అధికారులు, పాలకులకు గెడ్డపై కాజ్‌వే, బ్రిడ్జి నిర్మించాలని కోరినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. చాలా వరకు పనులు పూర్తయ్యాయి. బ్రిడ్జి పనులు పూర్తయితే గ్రామస్తులకు చాలా మేలు జరుగుతుంది.

– జన్ని సూర్యనారాయణ, శీబిల్లి గ్రామస్తుడు

### తాగునీరు, రహదారి సమస్య పరిష్కారం



శీబిల్లి గ్రామంలో చాలా ఏళ్ల నుంచి తాగునీటి సమస్య ఉంది. గ్రామం సమీపంలోని ఆయిల్‌పామ్ తోటల్లో రైతులు ఏర్పాటుచేసిన డ్రిప్‌పైపులనుంచి నీరుపట్టుకునేవారు. గ్రామంలో సుమారు రూ.9లక్షలతో రక్షితమంచినీటి పథకం, మరో రూ.50వేలతో బోరుబావిని ఏర్పాటుచేసి తాగునీటి ఇబ్బందులకు చెక్‌పెట్టాం. అలాగే కొత్తకామునివలస గ్రామానికి రహదారి లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు తన సొంత నిధులతో గ్రావెల్‌రోడ్డు ఏర్పాటుకు ఎర్త్‌వర్క్ పనులు జరిపిస్తున్నాం.

– పూడి రమణమ్మ, సర్పంచ్, ఎస్.పెద్దవలస పంచాయతీ